# కర్ణాటక వార్తలు

## దేవెగౌడ ఐటి అధికారా
### - డికె.శివకుమార్

బెంగళూరు,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి



డికె.శవకుమార్.

కర్ణాటక నుంచి కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు పంపుతున్నారని మాజీ ప్రధాని దేవెగౌడ చేసిన ఆరోపణలను కెపిసిసి అధ్యక్షుడు డికె.శివకుమార్ ఖండించారు.ఆయన శనివారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు.కర్ణాటక సర్కారు ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు పంపుతోందని ఆరోపించిన దేవెగౌడ ఎప్పుడు ఐటి అధాకారి అయ్యారని ప్రశ్నించారు.రాజకీయ లాభం కోసం మాజీ ప్రధాని ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయటం తగదని హితవు పలికారు.ఆయన జెడిఎస్ పార్టీ వ్యవహారాలు చేసుకుంటే మంచిదన్నారు.కాంగ్రెస్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం తగదన్నారు.కర్ణాటక నుంచి కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు పంపినట్లు మాజీ ప్రధాని వద్ద రుజువులు ఉంటే బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు.ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలవుతామనే భయంతోనే బిజెపి నాయకులు కేంద్ర సర్కారుపై వత్తిడితెచ్చి కాంగ్రెస్‌పార్టీ బ్యాంకు ఖాతాలను సీజ్ చేయించిందని ఆరోపించారు.ఐటీ అధికారులు మా బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము దోచుకున్నారు.పైగా 1823కోట్ల రూపాయల ఆదాయ పన్నులు చెల్లించాలని నోటీసులు ఇవ్వటం కేంద్ర సర్కారు పక్షపాత వైఖరికి నిదర్శనమని విమర్శించారు.బిజెపికు ఎన్నికల బాండ్లు వలన 6675కోల రూపాయలు వచ్చాయి వీటికి ఆదాయపన్నులు చెల్లించారా అని ప్రశ్నించారు.మేము ఎలాంటి ఆదాయపన్నులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.బిజెపి సర్కారుకు దగ్గరఘడియలు పడ్డాయి. ఆపార్టీ దేశప్రజలకు త్వరలోనే సమాధానం చెప్పాల్సి ఉంటుందని అన్నారు.

## ఏనుగుపై ఊరేగింపుగా వచ్చి నామినేషన్ వేసిన బీఎస్పీ అభ్యర్థి

రామనగర, మార్చి30, ప్రభాతవార్త ప్రతినిధి



ఏనుగుపై ఊరేగింపుతో వచ్చి నామినేషన్ వేసిన బీఎస్పీ అభ్యర్థి

బెంగళూరు గ్రామీణ జిల్లా లోక్‌సభకు శనివారం బీఎస్పి అభ్యర్థి నామినేషన్ వేశారు. బిఎస్పీ అభ్యర్థిగా చిన్నప్ప చిక్కహగడే ఏనుగుపైన ఊరేగింపుతో వచ్చి జిల్లాధికారి కార్యాలయంలో నామినేషన్ వేశారు.బీఎస్పీ ఎన్నికల గుర్తు ఏనుగు కావటంతో ఇతడు రామనగర బస్టాండ్ సర్కిల్ నుంచి వందలాది అభిమానులు వెంటరాగా నామినేషన్ వేశారు.బెంగళూరు రూరల్ లోక్‌సభలో 27లక్షల మంది ఓటర్లు ఉంటే ఎనిమిది అసెంబ్లీ సీట్లలో 3లక్షలకు పైగా దళిత ఓటర్లు ఉన్నారు.

## కర్ణాటక మూడుసీట్లకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్‌పార్టీ

బెంగళూరు,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి



కెపిసిసి అధ్యక్షుడు చిక్కబళ్లాపుర అభ్యర్థి రక్షా రామయ్యకు బిఫారం అందిస్తున్న దృశ్యం.

కర్ణాటకలో మరో మూడు లోక్‌సభ సీట్లకు కాంగ్రెస్‌పార్టీ శనివారం అభ్యర్థులను ప్రకటించింది.కోలారుకు కెవి.గౌతమ్,చిక్కబళ్లాపురకు మాజీ మంత్రి ఎంఆర్.సీతా రాం తనయుడు ఎంఆర్.రక్షా రామయ్యను, చామరాజనగరకు మంత్రి మహదేవప్ప తనయుడు సునీల్ బోస్ పేర్లను ప్రకటించింది. ముగ్గురు అభ్యర్థులకు కెపిసిసిఅధ్యక్షుడు డికె.శివకుమార్‌బిఫారాలను అందజేశారు.

## రాష్ట్రంలో రెండువిడతల్లో జరిగే లోక్‌సభ ఎన్నికలకు పబ్లిక్‌సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

బెంగళూరు,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి

కర్ణాటకలో రెండువిడతల్లో తలా 14సీట్ల వంతున జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజులను శలవురోజులుగా సర్కారు ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వం శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది.మొదటివిడతలో ఏప్రిల్ 26న 14సీట్లకు పోలింగ్ జరుగుతుంది.దక్షిణ కర్ణాటక ప్రాంత జిల్లాలైన కోలారు,చిక్కబళ్లాపుర,బెంగళూరు గ్రామీణ, బెంగళూరు సెంట్రల్,బెంగళూరు ఉత్తర, బెంగళూరు దక్షిణ లోక్‌సభ సీట్లు మరియు మండ్య,మైసూరుకొడగు, చామరాజనగర,దక్షిణకన్నడ,ఉడుపిచిక్కమగళూరు, మరియు హాసన్, చిత్రదుర్గ,తుమకూరు సీట్ల పోలింగ్ రోజు పబ్లిక్ శలవుగా ప్రకటించారు. రెండోవిడతలో మే7న పోలింగ్ జరిగే ఉత్తరకర్ణాటక 14సీట్లలో బీదర్, కల్బుర్గి,బాగలకోట,బీజాపూర్,కొప్పళ్,బళ్లారి,దావణగెరె,శివమొగ్గ,హావేరి,హుబ్లీధార్వాఢ,బెళగావి,చిక్కోడి,కారవారసీట్ల పోలింగ్‌రోజునసెలవు ప్రకటించారు.పై రెండురోజుల్లో సర్కారు కార్యాలయాలు బడులు కాలేజీలు,ప్రవేట్ పరిశ్రమలు అన్నిటికి శలవు అన్వయిస్తుందని నోటిఫికేషన్‌లో తెలియజేశారు. ఈసారి యాదగిరి జిల్లా శహపుర ఉప ఎన్నిక కూడా మే7న పోలింగ్ జరుగుతుంది.

## మండ్యలో పోటీ గురించి ఏప్రిల్ 3 తీర్మానం : సుమలత

బెంగళూరు,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి



అంబరీష్ అభిమానుల సభలో మాట్లాడుతున్న మండ్య సిట్టింగ్ ఎంపీ సుమలత.

మండ్య లోక్‌సభ పోటీచేయటం గురించి ఏప్రిల్3న మండ్యలో జరిగే సభలో తీర్మానిస్తామని మండ్య సిట్టింగ్ ఎంపీ సుమలత చెప్పారు.ఆమె శనివారం స్థానిక జెపినగర్ నివాసంలో తనను కలుసుకోవటానికి వచ్చిన వేలాది మంది మండ్యజిల్లా అభిమానుల సభలో మాట్లా డారు.మండ్యజిల్లా అంటే నాకు రెబెల్‌స్టార్ అంబరీష్‌తో ఉన్న సంబంధం వంటిదని చెప్పారు.ఈజిల్లాలో మాజీ మంత్రి తన భర్త అంబరీష్‌ను నమ్ముకుని గత 30 సంవత్సరాలుగా వెన్నంటి ఉన్న అంబరీష్ అభిమానులు అనుచరుల బాగుకంటే తనకు ఏదీ ఎక్కువ కాదని అన్నారు. మండ్యజిల్లాతో నా సంబంధం మండ్యఆడపడచుదని చెప్పారు.ఈజిల్లాలో అంబరీష్‌ను వెన్నంటి ఉన్న వేలాదిమంది అనుచరులను రక్షించుకునేందుకు ఈసారి నేను సరైన నిర్ణయం తీసుకుంటామని సుమలత అన్నారు.గత అయిదు సంవత్సరాల కిందట ఎవరి మద్దతు లేకుండా కేవలం అంబరీష్ అభిమానుల అండ చూసుకుని మండ్యసీటుకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి లక్షా27వేల ఓట్ల మెజారిటీతో గెలిచాను.ఈసారి కూడా ఇదే మాదిరిగా అంబరీష్ అభిమానుల అండతోనే సరైన రాజకీయ నిర్ణయం తీసుకుంటానని స్పష్టీకరించారు.ఈ సీటులో పోటీ గురించి ఇంకా మండ్యజిల్లా నాయకులతో చర్చించాలి. ఆ తరువాతనే పోటీ గురించి నిర్ణయం చెబుతానని అన్నారు. నేను పోటీ చేసినా రాజకీయాల్లో కొనాసాగాలన్నా అదీ మండ్య ప్రజల నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుందని అన్నారు.మండ్య నుంచి వచ్చిన వేలాదిమంది అభిమానుల తరుపున పలువురు నాయకులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మండ్యజిల్లాలో అంబరీష్‌ను నమ్ముకునే తమ రాజకీయాలు నడిపామని ఇప్పుడు నడిరోడ్డులో వదిలేసి పోవద్దని సుమలతకు మనవి చేశారు.మీరు కాదంటే మేము రాజకీయంగా అనాథలవుతాము.చావోరేవో సుమలత వెంటే ఉంటామని చెప్పారు. మండ్యమద్దూరు, శ్రీరంగపట్టణ, కెఆర్‌పేట, మళవల్లి నాగమంగల తాలూకాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు అభిమానులు తరలివచ్చారు.

## నేను అహంభావి కాదు ఆత్మాభిమానం ఉన్నవాడిని
### - సిఎం సిద్దరామయ్య

బెంగళూరు,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి



కర్ణాటక సిఎం సిద్దరామయ్య.

కర్ణాటకలో సుమారు ఏడుదశాబ్దాల రాజకీయఅనుభవం ఉండి తన జీవితాంతం ప్రతిపక్షనాయకుడిగా నిబద్ధతతో పనిచేసిన మాజీ ప్రధాని దేవెగౌడ తన రాజకీయ సంధ్యాసమయంలో ప్రధాని మోదీ వద్ద దేశసమస్యల అన్నిటికి రెమిడి ఉందని చెప్పటం శోచనీయమని కర్ణాటక సిఎం సిద్దరామయ్య చెప్పారు.ఆయన శనివారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.పాలకపక్ష రాజకీయాలతో ఏనాడు రాజీపడకుండా దేశ ప్రధానిగా ఎదిగిన దేవెగౌడ ఇపుడు స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపికు వంత పాడటం సమంజసంగా లేదని చెప్పారు.ఈయన తాను చూసిన దేవెగౌడ కానేకాదని చెప్పారు.కర్ణాటకకు కేంద్ర సర్కారు ప్రతీసారి పక్షపాతం చూపుతూనే ఉంది.కావేరి వివాదం కానీ,కృష్ణ వివాదం కానీ,కళసా బండూరి పథకం కానీ ఏనాడు రాష్ట్రానికి సాయం అందించని బిజెపిను ఇన్నాళ్లు విమర్శించిన దేవెగౌడ ఇపుడు లోక్‌సభ ఎన్నికల్లో మోదీ నామజపం ఏమిటని ప్రశ్నించారు.జెడిఎస్ పార్టీని బలీయమైన ప్రాంతీయశక్తిగా పెంచిన దేవెగౌడ ఇపుడు అదే పార్టీను బిజెపికు తాకట్టుపెట్టారని ఆరోపించారు. కర్ణాటకలో కరవు విలయతాండవం చేస్తుంటే కనీసం రూపాయి సాయం చేయని మోదీకు జెడిఎస్ ఎలా మిత్రపక్షంగా కొనసాగుతుందని ప్రశ్నించారు.ఆపార్టీకి ఆత్మాభిమానం లేదా అని నిలదీశారు.నేను కర్ణాటక కాంగ్రెస్ నాయకుడిగా ముఖ్యమంత్రిగా కన్నడిగుల ఆత్మాభిమానంకు భంగం కలగకుండా కాపాడుకునేందుకు కేంద్ర సర్కారును ఎదిరిస్తున్నానని సిద్దరామయ్య చెప్పారు. నిధుల పంపిణిలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించని ప్రతిపక్షాల వైఖరీను ఆయన ఖండించారు.

## తుమకూరులో సోమణ్ణ తరపున మాజీ ప్రధాని దేవెగౌడ ప్రచారం

తుమకూరు,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి



మాజీ ప్రధాని దేవెగౌడ.

తుమకూరు లోక్‌సభ సీటులో బిజెపి అభ్యర్థిని గెలిపించాలని మాజీ ప్రధాని దేవెగౌడ మనవి చేశారు. ఆయన శనివారం తుమకూరులోని బావికట్ట ప్రాంతంలో బిజెపి జెడిఎస్ కార్యకర్తల సభలో పాల్గొన్నారు. ఈసారి ప్రధానిమోదీని గెలిపించేందుకు మరోసారి తుమకూరు సీటులో బిజెపి గెలిపించాలని కోరారు.ప్రధాని మోదీ దూరదృష్టి కలిగిన నాయకుడని చెప్పారు.బిజెపి జెడిఎస్ పార్టీలు ఈసారి కర్ణాటకలో 28సీట్లు గెలుచుకుంటాయని ధీమాను వ్యక్తం చేశారు.సభలో బిజెపి అభ్యర్థి సోమణ్ణ మాట్లాడుతూ తన రాజకీయ గురువు దేవెగౌడ అని చెప్పారు.ఆయన శిష్యరికంలోనే తాను రాజకీయాల్లో పెరిగి పెద్దవాడిని అయ్యానని చెప్పుకున్నారు.తుమకూరులోని సిద్దగంగా మఠం స్వామిజీ డాక్టర్ శివకుమార స్వామి ఉన్నంత కాలం ఈమఠానికి నమ్మదగిన భక్తుడిగా నేను సేవలు అందించాను.ఇకమీదట కూడా తుమకూరు ప్రజలకు సేవలు అందిస్తామని చెప్పారు.కాగా బిజెపి జెడిఎస్ కార్యకర్తల సభ అంతా కేసరిశాలువాలతో నిండి పోయింది.

## చామరాజనగరలో కాంగ్రెస్ అభ్యర్థికు మద్దతు
### - మాజీ కేంద్రమంత్రి అల్లుడు కాంగ్రెస్‌లో చేరిక

బెంగళూరు,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి

చామరాజనగర జిల్లా లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌బోస్‌ను గెలిపించేందుకు తాను కాంగ్రెస్‌లో చేరినట్లు కేంద్ర మాజీ మంత్రి చామరాజనగర సిట్టింగ్ సభ్యుడు వి.శ్రీనివాసప్రసాద్ అల్లుడు ధీరజ్ ప్రసాద్ చెప్పారు.ఆయన శనివారం బెంగళూరు కెపిసిసి కార్యాలయంలో కెపిసిసి అధ్యక్షుడు డికె.శివకుమార్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సునీల్‌బోస్ మొదటి నుంచి తనకు మంచి మిత్రుడని చెప్పారు.చామరాజనగరలో కాంగ్రెస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని అన్నారు.మంత్రి మహదేవప్పతనయుడుగా సునీల్‌బోస్ జిల్లా ప్రజలకు పరిచితులని అన్నారు.

## నాపోరాటం అప్పామక్కళ అక్రమాలపైనే ః కెఎస్.ఈశ్వరప్ప

శివమొగ్గ,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కెఎస్.ఈశ్వరప్ప.

శివమొగ్గ లోక్‌సభ ఎన్నికల్లో తనకు కానీ తన కుమారుడికి టిక్కెట్టు దొరక్కకుండా చేసిన మాజీ సిఎం యడ్యూరప్ప ఆయన కుమారుడు బివై.విజయేంద్రలపైనే నా రాజకీయ పోరాటం కొనసాగుతుందని మాజీ ఉపముఖ్యమంత్రి బిజెపి అగ్రనాయకుడు కెఎస్.ఈశ్వరప్ప చెప్పారు.ఆయన శనివారం శివమొగ్గలో మీడియాతో మాట్లాడారు.నా కుమారుడు కాంతేష్‌కు శివమొగ్గ జిల్లా పొరుగున ఉన్న హావేరి లోక్‌సభ సీటుకు టిక్కెట్టు అడిగాను.తొలుత నాకు మాట ఇచ్చిన యడ్యూరప్పపిమ్మట తన అనుంగు అనుచరుడు మాజీ సిఎం బసవరాజ్ బొమ్మాయికు ఇచ్చారని ఆరోపించారు.గతంలో నామీద అవినీతి ఆరోపణలు వస్తే ఆనాడు మంత్రి పదవీకు రాజీనామా చేశాను.నాపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని కోర్టు తీర్పు వచ్చిన తరువాత నా మంత్రి పదవీను పునరుద్ధరించకుండా యడ్యూరప్ప అడ్డుపడ్డారని ఆరోపించారు.గత విధానసభ ఎన్నికల్లో నాకు వయస్సు పైబడిందని కారణం చూపి ఎంఎల్ఎ టిక్కెట్టు నిరాకరించారు.మరి యడ్యూరప్ప తనయుడు విజయేంద్రకు ఎలా టిక్కెట్టు ఇచ్చారని ప్రశ్నించారు.యడ్యూరప్ప కొడుక్కి టిక్కెట్టు ఇచ్చినట్టే నా కుమారుడు కాంతేష్‌కు టిక్కెట్టు ఇవ్వకుండా పక్షపాతం చూపారని ఆరోపించారు.ఇక్కడ శివమొగ్గలో యడ్యూరప్ప కొడుకు గెలిస్తే కేంద్ర మంత్రి అవుతారు.అక్కడ బెంగళూరులో బివైవిజయేంద్ర బిజెపి తరపున భవిష్యత్తు ముఖ్యమంత్రి అవుతారు.మరి యడ్యూరప్పఆయన కొడుకులే రాజ్యం ఏలితే నేను నా కొడుకు ఏం కావాలని ప్రశ్నించారు.నేను వీరశైవమఠాధిపతులను విమర్శించానంటూ బివైరాఘవేంద్ర చేసిన ఆరోపణలకు బహిరంగ చర్చకు తాను సిద్దంగా ఉన్నట్లు ఈశ్వరప్ప సవాల్ విసిరారు.నేను ఆరోపణలు చేయలేదు.కావాలంటే అయోధ్య రామమందిరంలో గుడిగంట మ్రోగించి నిజం చెబుతానని ఈశ్వరప్ప అన్నారు. ఈలోక్‌సభ ఎన్నికల్లో శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్ సభ్యుడిగా పోటీ చేస్తానని తెలిపారు.

## రాయచూరు జిల్లా సరిహద్దుల్లో 8.23లక్షల నగదు పట్టివేత ః ఎన్నికల సంఘం

రాయచూరు,మార్చి30,ప్రభాతవార్త ప్రతినిధి

రాయచూరు తాలూకా సరిహద్దుల్లోని కంప్లీ వద్ద శనివారం ఉదయం ఎన్నికల సంఘం అధికారులు జరిపిన సోదాల్లో ఒక మోటార్‌సైకిల్‌పై ముగ్గురు యువకులు అక్రమంగా తరలిస్తున్న 8.23లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ ముగ్గురు యువకులు వేరే ప్రాంతం నుంచి దీనిని తరలిస్తున్నారని వీటికి సరైన లెక్కలు చూపలేదని ఎన్నికల సంఘం అధికారులు చెప్పారు.

## నేడు కమ్యూనిస్టు యోధుడు ఛాయాపురం రంగన్న 6వ వర్ధంతి

-పేద బడుగు, బలహీనవర్గాల పక్షాణ రాజీలేని పోరాటం చేసిన రంగన్న-ఉరవకొండ ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర-ఛాయాపురం గ్రామానికి 6 సార్లు సర్పంచుగా సేవలందించిన రంగన్న

ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త



ఛాయాపురం రంగన్న (ఫైల్‌ఫోటో)

పేద బడుగు, బలహీనవర్గాల పక్షాణ పెత్తందారి వ్యవస్థపై పోరాడిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు తమ్మినేని (ఛాయాపురం) రంగన్న 6వ వర్ధంతి నేడు. 1948 నుండి 1985 వరకు ఉరవకొండ ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. రాకెట్లకు చెందిన కమ్యూనిస్టు యోధులు, రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, ప్యాపిలి కోటిరెడ్డి, చాబాల బండయ్య మాస్టర్‌ల సమకాలికుడైన ఆయన సుదీర్ఘ కాలం భారత కమ్యూనిస్టు పార్టీ తాలుకా కార్యదర్శిగా పనిచేశారు. కౌకుంట్ల భూపోరాటంలో చురుకైన పాత్ర పోషించి పార్టీలో తనదైన ముద్ర వేసుకొని పరిచయం అక్కర్లేని నాయకుడిగా ఎదిగారు. ఒకవైపు భూ పోరాటాలు నిర్వహిస్తూనే జిల్లా కరువు రూపుమాపడానికి తాగు, తాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం జరిగిన ఐక్య ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. రంగన్న వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం గ్రామానికి 6 సార్లు సర్పంచ్‌గా సేవలిందించడం విశేషంగా చెప్పాలి. రంగన్న వర్ధంతి, సంస్మరణ సభ ఆదివారం (నేడు) ఉరవకొండ పట్టణంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించడానికి ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు.

## రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం
### - కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్యాళ్ళ ప్రసాద్

ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు బ్యాళ్ళ ప్రసాద్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఉరవకొండ పట్టణానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్యాళ్ళ ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొని 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇవ్వడంతోపాటు హామీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. రైతులకు పెట్టుబడిమీద 50శాతం లాభంతో మద్దతు ధర, 2 లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ, మొదటి సంవత్సరం కేంద్రం ద్వారా 30 లక్షలు, రాష్ట్రం ద్వారా 2.25 లక్షల ఉద్యోగాలను కల్పిస్తుందన్నారు. ఉపాధి హామీ కూలీకు రోజుకు కనీస వేతనం 400 రూపాయలు, వృద్ధులు, వితంతువులకు 4వేల రూపాయల పింఛన్, వికలాంగులకు 6 వేల రూపాయల పింఛన్, ఇల్లు లేనివారికి 5 లక్షల రూపాయలతో పక్కా ఇళ్లు, కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తుందన్నారు. మహిళా మహాలక్ష్మి పథకం కింద ప్రతి పేద కుటుంబంలో ఒక మహిళకు ప్రతినెల 8,333 రూపాయలు సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సుఫీ కరీం, టైలర్ రమేష్, ఖాధర్, అహమ్మద్ తదితరులు ఉన్నారు.

## 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
### - ఉరవకొండ కేజీబీవీ ప్రిన్సిపాల్ యం.ధనలక్ష్మి

ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న కేజీబీవీ ప్రిన్సిపాల్ యం.ధనలక్ష్మి

పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం యంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్) ప్రవేశాలకుగాను విద్యార్థినులు ఏప్రిల్ 11వ తేదీలోగా వెబ్‌సైట్ ఎపికెజిబివి.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యం.ధనలక్ష్మి తెలిపారు. శనివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికిగాను 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ యం.ధనలక్ష్మి సూచించారు.

## ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను కలిసిన నర్రా కేశన్న..!

-ఎమ్మెల్యేకు షాలువాకప్పి పూలమాలతో సన్మానం

ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త



ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను కలిసిన నర్రా కేశన్న

ఎమ్మెల్యే, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను శనివారం సాయంత్రం ఇటీవలే టీడీపీకు రాజీనామా చేసిన ఉరవకొండ పట్టణానికి చెందిన నర్రా కేశన్న కలిశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనడానికి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఉరవకొండకు రాగా పట్టణంలోని ఒక ఫర్టిలైజర్ దుకాణంలో కలిసిన నర్రా కేశన్న ఆయనకు షాలువాకప్పి పూలమాలతో సన్మానించారు. త్వరలోనే తాను తన భార్య మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నర్రా సుజాతతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు టీడీపీకు రాజీనామా చేసిన సందర్భంగా నర్రా కేశన్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన ఎమ్మెల్యేను కలవడం ప్రాధాన్యతను సంతరించుకోగా తిరిగి టీడీపీలోకి చేరుతారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయభాస్కర్, రేగటి నాగరాజు, మోపిడి గోవిందు, పోలికి భీమన్న తదితరులు ఉన్నారు.

## సుంకులమ్మదేవాలయంలో టిడిపి ఎంపి అభ్యర్థి ప్రత్యేక పూజలు

గుత్తి, మార్చి 30 ప్రభాతవార్త



గుతిన్త శివారు ప్రాంతంలోని బాటసుంకులమ్మ దేవస్థానంలో శనివారం అనంతపురం టిడిపి పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మినారాయణ ప్రత్యేక పూజలు గావించారు. తన అభ్యర్థిత్వం ఖరారైన పిమ్మట హైదరాబాద్ నుండి వచ్చిన ఆయనకు బాచుపల్లి వద్ద వాల్మీకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు గావించిన అనంతరం పూజారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, సుధాకర్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

← అమ్మవారికి ఎంపి అభ్యర్థి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

## ఎన్నికల ప్రక్రియలో మాధ్యమాల పాత్ర కీలకం
### - మీడియా ప్రతినిధుల సెమినార్‌లో జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా



సెమినార్‌లో ప్రసంగిస్తున్న డి.సి.ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి, మార్చి30, ప్రభాతవార్త;

ప్రజాప్రభుత్వ వ్యవస్థలో జరిగే ఎన్నికల్లో ప్రింట్, టీవీ మాధ్యమాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. జెడ్పీ సభా భవనంలో జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా స్వీప్ సమితి, జిల్లా వార్తా సార్వజనిక సంస్కరశాఖల సంయుక్తాధ్వర్యంలో మాధ్యమ ప్రామాణికత, నిఘా సమితి కార్య విధానాలు (ఎంసీఎంసీ), నగదు చెల్లింపుతో కూడిన వార్తలు (పెయిడ్ న్యూస్) అంశంపై బళ్లారి మీడియా ప్రతినిధులకు చేపట్టిన ఒకరోజు సెమినార్‌లో జిల్లాధికారి మాట్లాడారు. ఇప్పటికే లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ప్రకటన వెలువడింది. బళ్లారి జిల్లాలో మే 7వ తేదీన పోలింగ్ జరుగుతుంది. ఎన్నికల సందర్భంలో మీడియాల పాత్ర మహత్తరమైంది. ఓటర్లకు ఎన్నికల గురించి ఉపయుక్తమైన సమాచారం ఇవ్వడంతో పాటు పోలింగ్ ప్రాధాన్యతను దినపత్రికలు, టీవీ మాధ్యమాలు సార్వజనికులకు జాగృతి కల్పించడంలో క్రియాశీలకంగా పాల్గొనాలని సూచించారు. ఎన్నికల సందర్భంలో మీడియాలు వాస్తవ స్థితిగతుల వార్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని, కేబుల్ టీవీలు, పత్రికల్లో, శాటిలైట్ చానెళ్లల్లో ప్రసారమయ్యే ప్రకటనలకు ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో టీవీల్లో ప్రసారమయ్యే, దినపత్రికల్లో ప్రచురితమయ్యే ఎన్నికలకు సంబంధించి ప్రతి వార్తా అంశాలపై నిరంతరం నిఘా వేసి ఉంచడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు, ఏడీసీ మహ్మద్‌జుబేరా, వార్తాధికారి తుకారాంరావులు ప్రసంగించారు.

## బళ్లారిలో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం పెద్దలతో భేటీ....
### - తన గెలుపుకు ఆశీర్వదించాల్సిందిగా వినతి



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కె.సి.కొండయ్యను కలిసి ఆశీర్వాదం తీసుకున్న లోక్‌సభ క్షేత్రం కాంగ్రెస్ అభ్యర్థి ఇ.తుకారాం

బళ్లారి, మార్చి30, ప్రభాతవార్త;

బళ్లారి లోక్‌సభ క్షేత్రం కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నుకోబడిన సండూరు ఎమ్మెల్యే ఇ.తుకారాం బళ్లారి నగరంలో అడుగుపెట్టారు. బుడా అధ్యక్షుడు జె.ఎస్.ఆంజనేయులు, డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ రఫిక్ స్థానిక 3వ వార్డు కార్పొరేటర్ ప్రభంజన్‌కుమార్, రాంప్రసాద్ తదితర కాంగ్రెస్ నాయకులు తుకారాంకు సాధరణ ఆహ్వానం పలికారు. తొలుత నగర ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం సందర్శించి దుర్గామాతకు విశేష పూజలు చేసి ప్రార్థించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ సీనియర్ నాయకులైన కె.సి.కొండయ్య, ముండ్లూరు నారాయణరావు (చిట్టి), పల్లెద ప్రభు, ముళ్లంగి రవీంద్రబాబు నివాసాలకు వెళ్లి వారితో సమాలోచనలు జరిపి తమ గెలుపుకు సహకరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంలో వారు కాంగ్రెస్ గ్యారెంటీ యోజనలు విజయవంతమైన నేపథ్యంలో తుకారాం గెలుపు ఖాయమని పలువురు నాయకులు తుకారాం వద్ద విశ్వాసం వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంలో నాయకులు కె.ఎస్.ఎల్.స్వామి, ఆజాద్‌అహ్మద్, బి.ఆర్.ఎల్.శీన, పరశురామ్(పర్భి) తదితరులు పాల్గొన్నారు.

## కంప్లీ చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న రూ.8.23 లక్షల నగదు స్వాధీనం

బళ్లారి, మార్చి30, ప్రభాతవార్త



కంప్లీలోని కోట చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీన పరుచుకున్న రూ.8 లక్షల నగదు

లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.8,23,440 నగదును కంప్లీ క్షేత్రంలోని కోట చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ అధికారుల బృందం స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసుకున్నట్లు జిల్లాధికారి, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. అబ్కారీ పోలీస్ అధికారులచే రూ.6,331 విలువైన 25.78 లీటర్ల మద్యం బాటిళ్లు, పోలీసుశాఖ అధికారులచే3 రూ.6513 విలువైన 12.15 లీటర్ల మద్యం లిక్కర్ బాటిళ్లను స్వాధీన పరుచుకున్నట్లు పేర్కొన్నారు. బళ్లారి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనాధికారికంగా తరలిస్తున్న 405 వెట్ మిక్సర్ గ్రైండర్‌లను, ఉపయోగించిన లారీని జప్తు చేసినట్లు, వీటి విలువ రూ.5,25,690గా ఉన్నట్లు, మొత్తం 08 కేసులు నమోదైనట్లు జిల్లాధికారి తెలిపారు.

## సిల్క్ సిటీ ఫెడరల్ బ్యాంక్ ప్రారంభించిన మాంటిస్సోరి కళాశాల అధినేత కృష్ణ భరత్



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్, మార్చి 30 ప్రభాతవార్త

పట్టణంలో సిల్క్ సిటీ ఫెడరల్ బ్యాంకు 2024 ఆర్థిక సంవత్సరం పరిగణలోకి తీసుకుంటూ శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో 138వ బ్రాంఆచ్‌ను స్వాతి ప్రియా అధ్యక్షతన శనివారం మాంటిసోరి ఎలైట్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ శాఖ బ్రాంచ్ మేనేజర్‌తోపాటు ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలోనే ప్రఖ్యాతి గాంచిన పట్టు పరిశ్రమలకు ధర్మవరం పట్టణంలో సిల్క్ సిటీ బ్రాంచ్‌ప్రారంభించడం సంతోషదాయకమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు, ఏరియా అధినేత్రి స్వాతిప్రియ శాఖాధిపతి ఆకురాతి ఓం సాయి వెంకట నరేంద్ర, వినయ్‌కుమార్, శ్రీనివాసులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

